# వెర్రికాదు, వేదాంతం!!

మంటలికి నాలుక లుంటాయట. కొంతమంది నోళ్ళల్లో మంటలు లేస్తాయట. మా వూళ్లోనూ మంటలు లేచాయి. ఊరిమీద లేచిన మంటలు పదహారుమైళ్ళ దూరాన వున్న మనుష్యుల నల్లగుడ్లల్లో ప్రతిబింబాన్ని చూసుకున్నాయి. వాళ్లు ఆశ్చర్యపోయారు. మా వూళ్లో యువజన సంఘం మేల్కొన్నది. ప్రకాశరావు పొలికేకలు పెట్టి నిద్రపొయ్యే యువకుల్ని సంఘంగా మేల్కొల్పాడు. నిద్రలేచిన సంఘం కళ్లు నులుపుకోకుండా కడవల నీళ్ళెత్తి పోసింది. మంటలు ఆరాయి.

ప్రకాశరావు నాకంటే పదిహేనేళ్ళు పెద్ద. నాకప్పుడు ఏడేళ్ళయితే ప్రకాశరావుకు యిరవై రెండై వుండాలి. నిద్రలో నేను కలకంటున్నాను. నవ్వులరాత్రులు నాకు దీపావళీ పువ్వుల పొట్లాలు తిప్పుకుంటూంటే మా నాన్న లేచి వూడిన గోచితో కేక లేస్తున్నారు: మంటలు! మంటలు! అని. మా అమ్మ నగలభరిణె పమిట చెంగున మూట కట్టుకుంటూ డబ్బులున్న కొయ్యపెట్టె అమాంతంగా లాక్కొస్తోంది.

మొన్న ప్రకాశరావుని పోలీసులు లాక్కుపొయ్యారు— రోజూ రాత్రిపూట నల్లులమీద నిద్రపోతున్నట్టి ప్రకాశరావును, నల్లులు నెమ్మదిగా పాకుతా యనుకుంటాను—అతని

కథా నిలయం
3415
శ్రీకాకుళం



శరీరమ్మీద పోలీసుల లాఠీలు దబదబా పడితే అతని వంటి మీద చుర్రు చుర్రుమని వుంటుంది!

ఊడ్పులూడ్చేవాళ్ళు సమ్మెకడితే షావుకారు ఆనందరామయ్యకూ చుర్రుమంది! ఆనందరామయ్య వాడు కూర్చుని గుమ్మడికాయ కోశాడనీ, వీడు నిలబడి నిమ్మకాయ కోశాడనీ, ఇంకెవడో వంగి వంకాయలు కోశాడనీ అంటాడు. పడుకుని పొట్లకాయ యెవడూ కోయలేదు ఆనందరామయ్య చూస్తూండగా. పరుగెత్తుతూ పొట్లకాయ కోసేవాడిని ఆనందరామయ్య చూచాడో లేదో నాకు తెలియదు.

ఆనందరామయ్య కల్లు తాగుతాడు. సొంత పొలంలో పని చేయించుకునేప్పుడు 'కల్లు కడవ' యిస్తాడు గూడాను. కల్లుకడవంటే యుద్ధం రాకపూర్వం కాని, యుద్ధం వున్నప్పుడు అర్ధణా, యుద్ధం అయింతర్వాత ముక్కాని. కల్లు కడవిస్తే కూలీలు రెట్టింపు పని చేస్తారు, బక్షీషిస్తే బొంబేలో వేశ్యలు 'రెట్టింపానందాన్ని'స్తారు.

ఆనందరామయ్యతో "కల్లుకడవ మానేసి రెట్టింపు కూలి"మ్మన్నాడు ప్రకాశరావు. "ఛో!" అన్నాడు ఆనందరామయ్య. కూలీలు పోయారు. సమ్మె కట్టారన్నాడు ఆనందరామయ్య.

వెంకటరత్తయ్య సమ్మెకట్టలేదు. వెంకటరత్తయ్యకూ మా వూరికీ చాలా దూరం. అతను 'ఇనప వ్యాపారం' చేస్తాడు. అందుకని అతను సమ్మె చెయ్యలేదు. చెయ్యని రోజుకు అధమం 'ఛప్పన్నవందల' లాభం వచ్చిందతనికి.

అందుకనే అతనిపేరు చెడింది. మావూళ్ళో: వెంకటరత్తయ్య వెంకటరత్నం అయ్యాడు. ఇప్పుడా? ఆర్. వెంకట. అతను సమ్మె చెయ్యలేదుగా? అతని పొట్ట పెరిగింది. మా వూళ్లో కూలీలు సమ్మె చేశారుగా? వాళ్ళ పొట్టలు పట్టాలయ్యాయి. ప్రకాశరావు 'యినపపట్టాలన్నాడు'. 'బండిపట్టా' లంటాడు!

మా వూళ్లో బళ్లు దున్నపోతులు లాగుతయి. మన ప్రభుత్వంకూడా 'బండి'లాంటిదట. బురదలో కూరుకుపోయిన బండిలాంటిదట. బురదలో కూరుకుపోయిన బండి లాగేప్పుడు మా వూరి దున్నపోతులు ఉపన్యాసా లియ్యవు. ఉపన్యాసాలతో బండి బయటపడుతుందనుకుంటే ఉపన్యాసా లిచ్చేవే నేమో!

జైలులోంచి బయట పడ్డవాళ్ళు మా వూళ్లో దేశభక్తులు. మా వూళ్లో చాలామంది దేశభక్తులే. దేశానికి వాళ్ళంటే కొండంత ఆశ. కళ్లల్లో పెట్టుకు పూజిస్తుంది. వాళ్ళిప్పుడు పొట్టల్ని పూజిస్తున్నారు. తెలివినీ పూజిస్తున్నామంటారు. వాళ్ళ తెలివి వాళ్ళ పొట్టల్లో వుంటుంది!...

మిగిలిన దేశభక్తంతా ఆత్మప్రేమ! నేను చెప్పిందంతా దేశభక్తే. దేశమంటే మట్టికాదు! నేను చెప్పిన మాట వింటే, వప్పుకుంటే, తలూపితే బడితె పడితే నువ్వు దేశభక్తుడివి, వినకపోతే నేను దేశభక్తుడిని. నువ్వా? దేశద్రోహివి! సింపిల్ యీక్వేషన్. నేను దేశభక్తుడిని, నువ్వు క్విస్లింగువి.

నిజం మాట్లాడితే నిష్టూరం. గొర్రెతోక గుప్పెడు,

పుట్టినవాడు గిడతాడు. [చావంటే స్వాతంత్ర్యం. స్వాతంత్ర్యం అన్నా చావే. నా ఆదర్శం అదీ!

నేను ఆదర్శవాదిని. నా ఆదర్శాలు విన్నారా? చూడ కండి! చూస్తే కళ్ళు పోతాయి. నా బుర్రలో కదిలే భావాలు నావి! వాటికి కారణం మీరు. మీరు లేందే నేను లేను. నేను లేనిదే మీరు లేరు. నేనున్నానుగా: మీరు లేరు! శుద్ధాబద్ధమని బుజూ చెయ్యండి. చూసేవాళ్ల కళ్లు పెరి కేస్తాను. మాట్లాడేవాళ్ళ పళ్లు గవ్వలు రాలినట్లు రాల్తాయి. దేశంకోసం రాలిన దేశభక్తుల హృదయాల పూలతో నా మెడలో దండ వేసుకున్నాను.

మీరు దేశభక్తిని అనుభవిస్తున్నారు. దేశభక్తి నా అనుభవం. అనుభవానికీ జ్ఞానానికీ సంబంధం లేదూ? సంబం ధం లేకుండానే అనుభవం జ్ఞానానికి క్రియ ఎట్లాగౌతుంది? అనుభవించిన ప్రతివాడూ జ్ఞాని కాకుండా ఎట్లాగుంటాడు?

దేశభక్తి నా జ్ఞానం. దేశం అంటే మట్టికాదు. దేశ మంటే ప్రకృతి! ప్రకృతి ప్రధానం; మీరు తర్వాత. మీరు లేనిదే దేశం లేదు. మీరు లేకపోయినా ప్రకృతి వుంది. మీరు ప్రకృతికి నతమస్తకులు కావాలి. మీ బొమికల్తో దేశానికి గుడి కట్టండి. మీ ఆకలి మంటల్తో హారతులివ్వండి. దేశానికి కర్పూరం అవసరం లేదు. మీ కడుపుల్లో కర్పూ రం ఎక్కడుంది?

మీరు బ్రిటిషు పరిపాలనాన్ని విమర్శించారు. బ్రిటిషు పరిపాలన మన దేశానికి శతృవయ్యింది. అందుకనే నేను

దానిని విమర్శించాను. మీరు నన్ను విమర్శిస్తున్నారు, నా శత్రువు శత్రువు నా మిత్రుడు కాబట్టి. మీరు నేను "చర్చిల్"ని కాదు. చర్చిల్ లేబర్ పార్టీని విమర్శించాడు, వాళ్లు పూర్తిగా ప్రజలకు అధికారం యివ్వలేదని కాదు: వాళ్ళిచ్చిన ఆ కొద్ది ఎందుకిచ్చారని, నేతి బీరకాయలో నేయి లేదని కాదు; బీరకాయలో నెయ్యి వుండకూడదని. నేను చర్చిల్ నెట్లా అవుతాను?

ఇదంతా విని నేను స్వకుచమర్దనం చేసుకుంటున్నాననుకుంటారా? మిమ్మల్ని నేను ప్రేమించటం లేదనుకుంటున్నారా? ప్రేమ కంటే గొప్ప గొప్పది. ఈ మాట మెడ మీద తలవున్న వాళ్ళందరికీ తెలుసు. గొప్ప ఎంత గొప్పది! ఇందుగల దందు లేదని సందేహము వలదు. ఇది తాకని మానవుడి ఆత్మలో నెత్తురు లేదు. వున్నదన్న వాళ్లు ఆ మాట ఎందుకంటున్నారో తెలుసా? వాళ్ళకి గొప్పంటే వున్న గౌరవం వల్ల. అదే తతంగం. గొప్పకున్న అకలి ప్రేమకు లేదు. ప్రేమ తినలేదు, సేవ చేస్తుంది. గొప్ప సేవని తింటుంది. చావును చూచి భయపడనిది గొప్ప ఒక్కటే, ఎందుకనో తెలుసా? చచ్చిం తర్వాత గొప్ప యింకా గొప్పదౌతుంది. ప్రేమకు దశావతారాలెత్తటం తెలియదు. సచ్ఛీలం, దేశభక్తి, ఆదర్శం, ఆత్మప్రేమ, యింకా యింకా యిలాగే యెన్నో...గొప్ప అగ్నిలో ఆజ్యం పోస్తుంది. ప్రధాన మంత్రి ఫోటో కళవళికల్లోనూ, మళయాళస్వామి కాషాయవస్త్రాల్లోనూ వుండగల మరో వస్తువుని చూపించండి. ఈ సుడి గుండంలో పడి తప్పకున్న వాళ్ళు వేరు. తప్పకోవాల్సని

యత్నించిన వాళ్ళున్నారా? నీ ఋజు స్వభావానికి యిది కవచం. నీ హాస్యానికిది మెరుగు. ఐనా నేను ప్రేమిస్తాను. నాది సర్వప్రేమ. అంచేతనే నేను గొప్పనిగూడా ప్రేమిస్తాను. తప్పేమిటి? లేకుంటే నేను చేసే పనుల్ని నేను చెయ్యలేను! నేను చేసిన పనుల్ని నేను చేసివుండేవాడినేకాదు.

మీరూ నేనూ కలిసి పనిచేశాం అంటే మీరు కావాల్నని అనుకున్న పనీ నేను చేసిన పనీ ఒకటనికాదు. ఒకటీ ఒకటీ కలిస్తే ఒకటెట్లా ఔతుంది? అందుకనే రెండయింది! నేను చేస్తానన్న సహాయం చెయ్యలేకపోయ్యాను. అది విజయ గర్వంవల్ల కాదు. నేనొక విచిత్రవ్యక్తినా? విజయాన్ని జీర్ణించుకోలేనూ? అపజయాన్ని మ్రింగలేనూ? నాకు మిత్రులెవ్వరో శత్రులెవ్వరో తెలీదూ? నేను నాకు మిత్రుణ్నో, కాదో నాకే తెలియదూ? నేను విచిత్ర వ్యక్తినా? నాకు తెలియదు.

మనకి తెలియని విషయాలు చాలా వున్నాయి. అందులో తప్పేముంది? వర్షాకాలం రాకనూ మానదు; ఎండాకాలం పోకనూ వుండదు. మీగ్గాకూ తెలుసు ఆ సంగతి. ఎండాకాలం ఎందుకు పోతుంది? వర్షాకాలం రాకపోతే ఏం? చెప్పండి చూదాం!

చెప్పడం చాతకాక చాలామంది తికమకలు పడుతున్నారు. నేను చెప్పింది చేయటంలేదట! చేయబోయింది చెప్పేవాళ్ళని చూస్తే నాకు నవ్వొస్తుంది. నేనేం చెప్తానో నాకు తెలుసు. అందుకనే తెలిసిందితప్ప మిగతాదంతా చెప్పాను. నాకో విషయం గుర్తుకొస్తోంది. మా వూళ్లో ఒక

సుబ్బారావున్నాడు. అతను మా తాలూకాఫీసులో క్లర్కు. హెడ్‌క్లర్కుకి వంగి వంగి సలాంచేస్తాడు. అతని స్నేహితునికి ఆత్మగౌరవం ఎక్కువ. "నువ్వట్లా చెయ్యొద్దురా" అన్నాడు. వాడికి మండింది. "నేను వంగి వంగి సలాంలు చేస్తే మోస పోయి, మీసాలు దువ్వుకొని లాభంచేసి హెడ్‌క్లర్కు వంటి వాళ్లుంటే వాళ్ళని మోసం చెయ్యాలిసిందేనోయ్" అన్నాడు. వాడు చెప్పిన సమాధానం వాడు తనతో తానే చెప్పు కున్నాడు. కాని వాడి స్నేహితులక్కాదు అనే మనస్తత్వ వేత్తల్ని చూస్తే నిజంగానే నాకు నవ్వొస్తుంది. సుబ్బారా వంత తెలివిగలవాడు ఓడంటాన్నేను.

నేను చెప్పింది చెయ్యటం లేదట. నేను చెప్పింది చేస్తానో లేదో తెలుసుకోలేని దద్దమ్మలా నన్నివ్వాళ్ళ విమ ర్శించేది ?

విమర్శించేవాళ్లు ఒక మాట గుర్తుంచుకోవాలి. నేను అది కావాలన్నాను. ఇది కావాలన్నాను. మీ కెప్పుడైనా అదంటే ఏమిటో చెప్పానా? ఇదంటే ఏమిటో చెప్పానా? ఒకవేళ ఎప్పుడైనా అన్నా అది యిదిగానూ యిది అదిగానూ మారదని, మారకూడదనీ చెప్పానా?

మీరు నన్నెరుగరు. నేను మిమ్మల్నెరుగుదును. నేను మాట్లాడిందంతా నేనే ననుకున్నారు మీరు. మీరు చేసే దంతా నా కేననుకున్నాను నేను. ఇవ్వాళ తూర్పున చుక్క పొడిచిందని మీరంటున్నారు. నాలాంటివాళ్ళు చాలమంది నాశనమౌతున్నారంటున్నారు మీరు. నాకూ తెలుసు ఆ

సంగతి. రానున్న దేదైనా రాకా మానదు; కానున్న దేదీ కాకా మానదు!

[రాకమాననిదీ, మానక వచ్చేదీ ఒకటే. అదే నాశనం; అదే మృత్యువు!]

నాకు జీవితమంటే నమ్మకమున్నప్పుడు అందరూ జీవించాలన్నాను. మీ అందరి వూపిరీ పీల్చి నేను బ్రతికాను; బ్రతుకుతున్నాను. "మేం బ్రతకటం లేదు" అంటున్నారు మీరు. "మేం బ్రతకలేకపోతే నువ్వు చస్తావ్" అంటున్నారు మీరు. మీరు చెప్పేదానికీ, నే ననేదానికి పెద్ద తేడా ఏమీ లేదు. "నేను చస్తే మీరు చస్తారు. మీరు చావటంచూస్తూ చస్తాను" అంటున్నాను నేను. నేను చచ్చింతర్వాత మీరు బ్రతికితే ఎవడిక్కావాలి? చస్తే ఎవడిక్కావాలి?

నాకు కావలసిందే నేను. చచ్చినా నేనే, బ్రతికినా నేనే. ముందున్న జీవితం కోసం చేతిలోవున్న చావుని వదలుకోవడం నా కిష్టంలేని పని. ఇంగ్లీషులో ఒక సామెత వుంది. పొదలోవున్న రెండు పిట్టలకంటే చేతిలోవున్న ఒక్క పిట్టయినా మెరుగే.

మీకు మెరుగెక్కిన సలహా ఒకటి యిస్తాను. చేతిలో వున్న చావునిచూచి భయపడటానికి వొప్పుకోకపోతే గతంలో బ్రతకండి. గతంలో మనం బ్రతికాంగా. అప్పుడు మనమందరమూ ఒకటే. గతం చచ్చిందనేవాళ్ళ మాటా, చావులో బ్రతకటం కలనీ కల్లనీ అనేవాళ్ళ మాటా నా ముందెత్తకండి. వాళ్ళందరూ బ్రతకనేర్వనివాళ్లు!

నా ముందు మీరెత్తగలిగిన మాటా, ఎత్తవలసిన మాటా ఒకటే. అదే 'వ్యక్తి స్వాతంత్ర్యం' అది వొక పవిత్రపదం ఆ పదం దేదీప్యమానంగా వుండే సూర్య భగవానుడు లాంటిది. అది నేను పట్టుకొన్న చివరి 'గడ్డిపరక.'

మనం స్వాతంత్ర్యాగ్నికి సమిధలమన్నాను ఒకప్పుడు గుర్తుందా? ఈ వ్యక్తి స్వాతంత్ర్యం ముందు మీరంతా గడ్డిపరకలు. "మనమందరం గడ్డి పరకలం!" అనమన్నా అంటాను. మీకు తెలుసు నేనెప్పుడూ మాట్లాడడంలో వెనుకంజవెయ్యలేదని. "మనమందరం సమిధలం" అన్నప్పుడు నేను సమిధనయ్యాను గనుకనా?

"వ్యక్తి స్వాతంత్ర్యం కావాలి!"

ఈ విశాల విశ్వం అంతా ఆ వ్యక్తి స్వాతంత్ర్యం ప్రకాశించి పూస్తే వెలుగులో ఒక పెద్ద 'నీడ'. నీడకూ మచ్చకూ యేమీ తేడాలేదు. చంద్రుడిలోవున్న నీడని చాలమంది మచ్చ అంటారు.

మనకు కావలసింది మచ్చలున్న వెలుగుకాదు. అంచేత యీ విశాల ప్రపంచాన్ని మనం తుడిచిపెట్టేసిన నాడు ఆ వ్యక్తి స్వాతంత్ర్యం జ్యోతి కరతలామలక మౌతుంది. ఆ జ్యోతిలో ప్రపంచం మునగాలి.

పడమటి సూర్యుడు మునుగుతున్నాడు. సముద్రమధ్యంలో ఓడమీద ప్రయాణంచేస్తూ సూర్యాస్తమయాన్ని చూడాలి. అందులోను సిలోన్ (లంక)కి దక్షిణంగా వందమైళ్ల దూరాన వున్న సముద్రంలో ఓడమీద నిలబడిచూడాలి.

వాన్‌గోగ్ బహుశా అక్కడేనిలబడి గీచాడేమో ఆ సూర్యాస్తమయ చిత్రాన్ని. అతను సూర్యోదయాన్ని గీయలేదెందు కనో? సూర్యోదయం అనగానే నాకు మా వూరు గుర్తొస్తుంది. వూరికి తూర్పుగా పంటకాల్వ వుంది. పంటకాల్వ అవతల వేపచెట్టు వుంది. ఆ వేపచెట్టు వెనక పుట్టేవాడు సూర్యుడు. పుట్టే సూర్యుడికి ఎదురుగా కాలువ గట్టుమీద కూర్చుని వేపపుల్లతో పళ్ళు తోముకునే వాళ్ళం నేనూ, ప్రకాశరావూ. మా వూళ్లో పెద్దవాళ్లు "పొడిచే పొడిచే సూర్యుడి కెదురుగుండా కూర్చుని పళ్ళుతోముకోగూడదురా! చిన్నాడికి వాడికి బుద్ధిలేదనుకుంటే ప్రకాశరావూ! మున్నేళ్ళొచ్చినై నువ్వన్నా చెప్పకూడదంట్రా" అనేవాళ్ళు. ఆ పెద్దవాళ్ళందరూ దేశభక్తులే. ప్రకాశరావు నా వంక చూచి నవ్వేవాడు. "ఎందుకట్లా నవ్వుతావ్" అన్నా ఒకనాడు.

"వాళ్ళకిమల్లే పగలల్లా పడుకుని సాయంత్రం లేచి సూర్యుడు కుంకేప్పుడు వాడి కెదురుగా కూర్చుని పళ్ళుతోముకోవాలట్రా!" అన్నాడు.

"నే నెప్పుడూ చూడలేదే?" అన్నా.

"నువ్వింకా కుర్రాడివిలేరా" అన్నాడు ప్రకాశరావు.

ప్రకాశరావు ఖైదులో వున్నాడు. యింకా పొడిచే పొడిచే సూర్యుడి కెదురుగుండా కూర్చునే పళ్లు తోముకుంటు న్నాడేమో? సూర్యుడు జైలుకి ఎటువైపున ఎప్పుడు పొడు స్తాడో! పొడిచే పొడిచే సూర్యుణ్ని చూచినప్పుడల్లా నాకు ప్రకాశరావు గుర్తుకొస్తాడు.

పడమట మునిగే సూర్యుణ్ని చూస్తూంటే నాకు తగలడుతూన్న మా వూరు గుర్తుకొస్తుంది. మా వూళ్ళో పెద్దవాళ్లు గుర్తుకొస్తారు. వాళ్ళనే 'వ్యక్తి స్వాతంత్ర్యం' సంగతి గుర్తుకొస్తుంది. తాగిన మనిషిలా నడిచే చీకట్ల ముందుమునిగే సూర్యుణ్ణీ, సముద్రాన్నీ మరువలేను నేను.

కుంకిన పొద్దు కుంకినట్లే వుంటుందా? రేపు ప్రొద్దున 'పొద్దు పొడుస్తుంది' ఎండాకాలం పోకామానదు, వానాకాలం రాకనూ మానదు.

రాక మానననిదీ, మానక వచ్చేదీ ఒకటే. అదే 'నడక' అదే 'జీవితం.'

(అంకితం : పుట్టే రేపుకీ గాదు, గిట్టిన నిన్నకూ కాదు.)

—::—